సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



కార్గో సర్వీసులు ప్రారంభం

రంపచోడవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కార్గో, పార్శిల్ సర్వీస్‌లను సోమవారం సర్పంచ్ మంగా బొజ్జయ్య ప్రారంభించారు.



ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌జామ్

మారేడుమిల్లి -చింతూరు ఘాట్ రోడ్‌లో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. 8లో



సమస్యల పరిష్కారానికి కృషి

మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

ఆంత్రాక్స్ ప్రబలిన గ్రామాలను సందర్శించిన కేంద్ర బృందం



జోడిగుడలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర పరిశోధన బృందం

డుంబ్రిగుడ: ఆంత్రాక్స్ వ్యాధి ప్రబలిన రెండు గ్రామాలను కేంద్ర పరిశోధన బృందం సోమవారం సందర్శించింది. మండలంలోని కంద్రుం పంచాయతీ జోడిగుడ,అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామాల్లో గతంలో ఆంత్రాక్స్ ప్రబలింది. దీనిపై పరిశోధనకు కేంద్ర బృందం ఆయా గ్రామాల్లో పర్యటించింది. మళ్లీ ఆంత్రాక్స్ ప్రబలిందా, ఆంత్రాక్స్ వ్యాక్సిన్ వేస్తున్నారా తదితర వివరాలను పశుసంవర్ధక శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకుంది. ఈ నివేదికను కేంద్రానికి అందిస్తామని బృందం సభ్యులు తెలిపారు. ఆంత్రాక్స్ ప్రాజెక్ట్ మాలిక్యులర్ ఎపిడెమియాలజీ, రిస్క్ అసెస్‌మెంట్ డాక్టర్ రాణి ప్రమీల, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ తో పాటు డాక్టర్ హిమజ, పశుసంవర్ధక శాఖ ఏడీ ,వైద్యులు గౌతమ్,శీనయ,సిబ్బంది అనురాధ,సుబ్బారావు పాల్గొన్నారు.

అల్లం రైతుకు దక్కని గిట్టుబాటు ధర

లాభపడుతున్న దళారులు, వ్యాపారులు



సాక్షి,పాడేరు: మన్యంలో గిరిజన రైతులు కష్టపడి సాగుచేసే అల్లానికి గిట్టుబాటు ధర కరవైంది.స్థానిక దళారులతో పాటు విశాఖ,విజయనగరం, ఎస్.కోట, గాజువాక ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏజెన్సీలోని గిరిజన రైతుల నుంచి హైబ్రిడ్ అల్లాన్ని కిలో రూ.30కి ,దేశవాళి అల్లాన్ని కిలో రూ.25కి కొనుగోలు చేస్తున్నారు. అయితే మైదాన ప్రాంతాల్లో కిలో రూ.65కు విక్రయిస్తున్నారు. అరకులోయ,డుంబ్రిగుడ,హుకుంపేట, పాడేరు మండలాల్లో సాగవుతున్న అల్లాన్ని వారపుసంతలు,మండల కేంద్రాల్లో వ్యాపారులు తక్కువ ధరతో కొనుగోలు చేస్తుండడంతో గిరిజన రైతులు నష్టపోతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

పాడేరు రూరల్: విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా హెచ్చరించారు. మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రసవాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ద్వారా నిర్వహించే వైద్య శిబిరాల్లో వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రిలో అధిక స్థాయిలో సుఖ ప్రసవాలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతీ ఆదివారం మినుములూరులో నిర్వహించే వారపు సంత రోజున వైద్యాధికారి, సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా టీబీ పర్యవేక్షకులు వి. కిరణ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ కోర్సుల సిలబస్ పూర్తికానందున, కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి పరీక్షలను వాయిదా వేశామన్నారు. పరీక్షలు ఎప్పటి నుంచి నిర్వహించేది త్వరలో కళాశాలకు తెలియజేస్తామన్నారు.

9న భువనేశ్వర్-చెన్నై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): భువనేశ్వర్-చెన్నై (12830) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వ తేదీన 1.15 గంటలు ఆలస్యంగా 1.25 గంటలకు బయల్దేరుతుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఈ రైలు భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సి ఉండగా పలాస-విశాఖపట్నం సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల వల్ల రీ షెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

జోరుగా రబీ

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ • 2700 హెక్టార్లలో సాగు



నారు సేకరిస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రబీలో రెండవ పంటగా వరి సాగు చేస్తున్నారు. 22 మండలాల పరిధిలో నీటి నిల్వలు అధికంగా ఉన్న లోతట్టు 2,700 హెక్టార్లలో ప్రతీ ఏడాది రబీలో వరి సాగు చేస్తారు. రెండు నెలల నుంచి రైతులంతా తమ వద్ద ఉన్న సంప్రదాయ వరి విత్తనాలతో నారుమడులు వేస్తున్నారు. నారుమడులన్నీ ఆశాజనకంగా ఎదగడంతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రబీ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఒక వైపు దమ్ము పనులు చేపడుతుండగా, మరో పక్క నారు సేకరణ, కట్టలు కట్టే పనులు ఉత్సాహంగా చేస్తున్నారు. దమ్ము పనులు పూర్తయిన చోట మరుసటి రోజు వరినాట్లు చేపడుతున్నారు. నారు ముదిరిపోక ముందే నారుతీత, వరినాట్లు వేయాలని, సచివాలయాల పరిధిలోని వ్యవసాయ అసిస్టెంట్లు గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. హుకుంపేట,పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని పలు గ్రామాల్లో వరినాట్లు పడ్డాయి.

పాడేరు డివిజన్‌లో ..

పాడేరు డివిజన్‌కు సంబంధించి 11 మండలాల పరిధిలో 1,554 హెక్టార్ల విస్తీర్ణంలో గిరిజన రైతులు రబీ సాగు చేపట్టారు. ముంచంగిపుట్టు మండలంలో 194 హెక్టార్లు, పెదబయలులో 271, డుంబ్రిగుడలో 119, అరకులోయలో 83, అనంతగిరిలో 99, హుకుంపేటలో 114, పాడేరులో 198, జి.మాడుగులలో 156, చింతపల్లిలో 59, జి.కె.వీధిలో 140, కొయ్యూరులో 120 హెక్టార్ల విస్తీర్ణంలో ఏటా గిరిజన రైతుల రబీలో వరిపంటను సాగుచేస్తున్నారు.



జి.మాడుగుల మండలం గన్నెరుపుట్టులో దమ్ము పనులు చేస్తున్న గిరిజన రైతులు

నారు ముదరక ముందే..



ముదరక ముందే నారు సేకరించి, వెంటనే నాట్లు వేసుకోవాలి.నారు ముదిరిపోతే దిగుబడులు తగ్గే పరిస్థితులు నెలకొంటాయి. నాట్లు వేసే సమయంలో పంట భూముల్లో నీటి నిల్వలు అధికంగా లేకుండా చూసుకోవాలి. పంట గింజదశకు వచ్చేంత వరకు సస్యరక్షణ పనులు చేపట్టాలి.

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి,పాడేరు

విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అటవీశాఖ సహకారం

అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సుశాంత్‌నందా

ముంచంగిపుట్టు: నూతన జోలాపుట్టు మినీ హైడల్, బలిమెల లోయర్, మాచ్‌ఖండ్ లోయర్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అటవీశాఖ సహకారం పూర్తిగా ఉంటుందని ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సుశాంత్‌నందా చెప్పారు. ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని మొట్టమొదటి సారిగా ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ అటవీశాఖ కన్జర్వేటర్ సుశాంత్‌నందా సోమవారం సందర్శించారు. జలవిద్యుత్ కేంద్రానికి వించ్‌లో ప్రయాణం చేశారు. వించ్ అనుభూతిని ఆస్వాదిస్తూ, వించ్ నిర్మాణం, బాగోగులపై ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి, అధికారులు,సిబ్బందితో మాట్లాడి జనరేటర్లు పరిస్థితిపై ఆరా తీశారు.ఆధునికీకరణలో భాగంగా ప్రాజెక్టు ప్రాముఖ్యతను, వర్షపాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఉద్యోగులు,సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సుశాంత్‌నందా మాట్లాడుతూ అత్యంత పురాతన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం ఓ అద్భుతమన్నారు. బలిమెల వద్ద నూతనంగా నిర్మిస్తున్న 60 మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి కావలసిన అనుమతులు త్వరలోనే రానున్నాయని చెప్పారు.డుడుమ జలపాతం వద్ద అభివృద్ధి పనులకు పంచాయతీల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి నివేదిక తెప్పించి, దాని ఆధారంగా డుడుమ పనులు చేపడతామన్నారు. ఒడిశా విద్యుత్ కార్పొరేషన్ డైరెక్టర్ (ఆపరేషన్) ఆశీష్‌కుమార్ మహంతి మాట్లాడుతూ మాచ్‌ఖండ్ ఆధునికీకరణ కోసం ఇప్పటికే ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం పూర్తి అయిందని, ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో జోలాపుట్టు మినీ హైడల్,లోయర్ బలిమెల, మాచ్‌ఖండ్ లోయర్ విద్యుత్ కేంద్రం నిర్మాణాలకు అడ్డంకులు తొలగిపోతే నిర్మాణ పనులు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో మాచ్‌ఖండ్ ఎస్‌ఈ కె.వి.నాగేశ్వరావు, ఈఈ జనరేషన్ బి.గోవిందరాజులు, ఈఈ సివిల్ ఆదిత్యసామంత్రయ్, ఈఈ కొల్లబ్ కె.రమేష్, ప్రాజెక్టు ఏడీఈలు రాజ్‌కుమార్,అమరేంద్ర త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



మాచ్‌ఖండ్‌ను సందర్శిస్తున్న ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సుశాంత్‌నందా

త్వరితగతిన రీ సర్వే

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: జగనన్న భుహక్కు, భూ రక్ష ప్రోగ్రాం ద్వారా చేపట్టిన రీ సర్వేను వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం ఏడు మండలాలకు చెందిన సర్వేయర్లకు సర్వే పరికరాలు, మెడికల్ కిట్లు, రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ సుమారు 80 మంది సర్వేయర్లకు కిట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. అన్ని గ్రామాల్లో సర్వేకు ముందు గ్రామసభలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో ఆయా గ్రామాల్లో సర్వే టీంలు నిబంధనల ప్రకారం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ రవి శంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సర్వే టీమ్‌లకు కిట్లు పంపిణీ చేస్తున్న పీవో, సబ్ కలెక్టర్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఈఈ నీలాకృష్ణ

చింతపల్లి/గూడెంకొత్తవీధి: గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నీలకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని గూనలంక, చిన్నగెడ్డ, పెదవలస, రంపుల, మంగళపాలెం, లక్కవరపేట, సంకాడ గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో నీటి ఎద్దడిని నివారించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం నూతన బోర్ల నిర్మాణానికి నీటి స్థాయి పరీక్షలను పలుగ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈ రుక్మేంద్ర రాజు, చింతపల్లి, జీకే వీధి జేఈలు స్వర్ణలత భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

కేకేలైన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు

అనంతగిరి: కొత్తవలస-కిరండూల్ (కేకే)లైన్‌లో తరచూ రైళ్ల పట్టాలు తప్పుతున్న ఘటనలు జరుగుతుండడంతో వీటి నియంత్రణకు రైల్వే శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. కోరాపుట్టు- అరకు సెక్షన్‌లోని రైల్వే మార్గంలోని ప్రధాన స్టేషన్లు, లెవిల్ క్రాసింగ్, వంతెనలు, సొరంగాలు, వంపులు, ఇటీవల గూడ్సు రైలు పట్టాలు తప్పిన శివలింగపురం స్టేషన్‌యార్డు తదితర ప్రదేశాల్లో సోమవారం సెంట్రల్ రైల్వే, ముంబై నుంచి వచ్చిన ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి డి.వై.నాయక్ ఆధ్వర్యంలోని ప్రత్యేక భద్రత అడిట్ బృందం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించింది. ముఖ్యంగా రైళ్ల సురక్షిత నిర్వహణ కోసం అన్ని నియమాలు, మార్గదర్శకాల అమలును నిర్ధారించడానికి రైల్వే అధికారులు మల్టీ డిసిప్లినరీ బృందం ద్వారా ఇంటర్ జోనల్ సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తుంటారు. రైల్వే మార్గంలో చేపట్టిన ఆడిట్ రిపోర్టులను, యాక్షన్ టేకెన్ రిపోర్టులను రైల్వే మంత్రిత్వ శాఖకు సమర్పిస్తారు. భద్రత పనితీరును అంచనా వేయడానికి, సిస్టంలో వైఫల్యాలు, లోపాలను గుర్తించేందుకు ఈ తనిఖీలు ఉపయోగపడతాయని వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. తనిఖీల్లో చీఫ్ ట్రాక్ ఇంజినీర్ ఎ.కె.పాండే, చీఫ్ ఎలక్ట్రికల్ సిగ్నల్ ఇంజినీర్ ఆర్.బి.దేశ్‌ముఖ్, చీఫ్ రోలింగ్‌స్టాక్ ఇంజినీర్ సుయేష్‌నారాయణ్, సేఫ్టీ ఇంజినీరింగ్ టీమ్‌తో పాటుగా ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్‌సాహూ, చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అనిల్‌కుమార్ పాట్కే తదితరులు పాల్గొన్నారు.



కేకేలైన్‌లోని కొలాబ్ వంతెన వద్ద తనిఖీ చేస్తున్న డి.వై.నాయక్, ఆడిట్ సభ్యులు

మీరే విజయ రథ సారథులు

- కన్వీనర్లు,గృహ సారథులు కలిసి పనిచేయాలి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకు అసెంబ్లీ పరిశీలకుడు కొండలరావు

ముంచంగిపుట్టు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయ రథ సారథులుగా గృహ సారథులు పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకు అసెంబ్లీ పరిశీలకుడు కొండపల్లి కొండలరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణంలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' అనే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చెట్టి పాల్గుణ, జల్లిపల్లి సుభద్ర, కొండలరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమపాలను అందిస్తున్నారని, మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలు అమలుపై గృహసారథులు, కన్వీనర్లు ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. టీడీపీ పాలనలో దోచుకోవడం,దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని చెప్పారు. మళ్లీ జగనన్న సీఎం కావాలనే సంకల్పంతో మనమంతా సైనికుల్లా పని చేయాలని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా గృహసారథులు,కన్వీనర్లు,వలంటీర్లు పని చేయాలని సూచించారు. ప్రతీ గృహాన్ని సందర్శించి పథకాలు అమలు తీరుగురించి తెలుసుకోవాలని, రాష్ట్రంలో 99శాతం హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పథకం మంజూరు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆమె చెప్పారు. అనంతరం అరకు పరిశీలకుడు కొండలరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా అంతా కలిసి పనిచేయాలని చెప్పారు. ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. అనంతరం గృహసారథులు,వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్,స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ సోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెట్టి గంగధర్ స్వామి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంగడ రమేష్, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,మండల నేతలు,అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, అరకు అసెంబ్లీ పరిశీలకుడు కొండలరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- చింతపల్లిలో 8.9 డిగ్రీలు
- అరకులోయలో 9.4 డిగ్రీల నమోదు
- దట్టంగా పొగమంచు



పాడేరులోని డాక్టర్ అంబేడ్కర్ సెంటర్‌లో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో పాటు,కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. సోమవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 8.9 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 9.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 13 డిగ్రీలు నమోదైంది. పొగమంచు ఉదయం 9గంటల వరకు దట్టంగా కురిసింది. చలిగాలులు తీవ్రతంగా వీచాయి.

రూ. 962 కోట్లతో కాఫీ తోటల విస్తరణకు ప్రతిపాదనలు

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరురూరల్: రానున్న ఐదేళ్లలో కాఫీ విస్తరణకు రూ.962 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కాఫీ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశమందిరంలో కాఫీ అధికారులు, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని 2.13 లక్షల మంది రైతులు కాఫీ సాగుచేస్తున్నారని, 2015లో మంజూరుచేసిన కాఫీ ప్రాజెక్టు 2023-24 ఆర్థిక సంవత్సరంతో ముగుస్తుందని చెప్పారు. లక్ష ఎకరాల్లో నీడతోటలు, 50వేల ఎకరాల్లో కాఫీ తోటల పునరుద్ధరణ, 75వేల ఎకరాల్లో కాఫీ తోటల విస్తరణ చేపట్టినట్టు చెప్పారు. 2020 సంవత్సరం జూలై నుంచి 9 విడతల్లో 1.08 లక్షల ఎకరాలకు అటవీహక్కు పత్రాలను పంపిణీ చేసినట్టు చెప్పారు. కాఫీ రైతుల అభ్యున్నతికి కృషిచేస్తున్నామని, అందులో భాగంగా కాఫీ రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు కాఫీ బోర్డుకు ప్రతిపాదనలను పంపించామన్నారు. కాఫీ రైతులు మాట్లాడుతూ తమకు ఆదాయాన్నిచ్చే కమల, దాల్చినచెక్క, లవంగం, యాలకుల మొక్కలను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు అశోక్, 11 మండలాలకు చెందిన కాఫీ రైతులు పాల్గొన్నారు.



సమావేశంలోని మాట్లాడుతున్న పీవో గోపాలకృష్ణ

'దిశ' పనితీరు ప్రశంసనీయం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

డొండపర్తి(విశాఖ దక్షిణ): ఏపీ పోలీస్ దిశ యాప్ పనితీరు పట్ల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో ఒక హోటల్‌లో సోమవారం జరిగిన జాతీయ స్థాయి మహిళా సదస్సు చివరి రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన దిశ స్టాల్‌ను సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ అందిస్తున్న సేవలు, ఎస్‌వోఎస్ బటన్ పనితీరును ప్రశంసించారు. అలాగే నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ చైర్మన్ రేఖా శర్మతో పాటు సదస్సులో పాల్గొన్న ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రతినిధులకు దిశ యాప్ ప్రాముఖ్యతను, ఎస్‌వోఎస్ బటన్ పనితీరును వీడియో ద్వారా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి వివరించారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'షీ ఇజ్ ఏ ఛేంజ్ మేకర్' ప్రాజెక్టులో భాగంగా మహిళా ఎమ్మెల్యేలతో జరిగిన సదస్సులో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రారంభించిన దిశ సంబంధిత కార్యక్రమాలను వివరిస్తూ విశాఖ నగర పోలీసులు ఏర్పాటు చేసిన దిశ స్టాల్ మహిళా ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అప్లికేషన్‌లో అత్యంత స్వల్ప వ్యవధిలోనే 1,11,39,456 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం గొప్పవిషయని మహిళా ప్రజా ప్రతినిధులు కొనియాడారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ఏపీ పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు గొప్పగా ఉన్నాయని ప్రశంసించారు.



దిశ స్టాల్‌ను సందర్శించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మండుటెండలో అమ్మ బతుకు కష్టం.. చిగురుటాకులతో కంటిపాపకు ఛత్రం



ప్రస్తుతం ఏజెన్సీవ్యాప్తంగా పసుపు,అంతరపంటగా వేసిన పిప్పళ్లమోడి తవ్వకాల్లో గిరిజనులు బిజీగా ఉన్నారు. గొండెలి పంచాయతీ సాగిపుట్టు గ్రామ సమీపంలో ఓ తల్లి తన బిడ్డకు ఎండ తగలకుండా కొమ్మలతో నీడను ఏర్పాటు చేసి నిద్రబుచ్చి, పక్కనే ఎండలో పిప్పళ్లమోడిని కట్ చేసే పనిలో నిమగ్నమైంది. –సాక్షి, పాడేరు

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు

గూడెంకొత్తవీధి: మండలంలోని ఆర్వీ నగర్‌కు చెందిన యువకుడు ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పెద్దిశెట్టి వీరబాబు ద్విచక్రవాహనంపై నర్సీపట్నం వెళుతూ చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టాడు. దీంతో అతని తల వెనుక భాగంలో తీవ్రగాయమైంది. 108 వాహనంలో అతడిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

ఒకరికి కారుణ్య నియామకం

రాజవొమ్మంగి: కారుణ్య నియామకాల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నడిగట్ల దేవిక అనే యువతికి శరభవరం వీఆర్‌ఏగా ప్రభుత్వం పోస్టు ఇచ్చినట్టు డీటీ సత్యన్నారాయణ సోమవారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 10న విధినిర్వహణలో ఉన్న శరభవరం వీఆర్‌ఏ ఎండయ్య రోడ్‌పై పడిపోగా తలకు బలమైన గాయమైంది. ఆసుపత్రికి తరలించేలోగా ఎండయ్య మరణించాడు. దీంతో ప్రభుత్వం ఎండయ్య కుటుంబంలోని దేవికకు వీఆర్‌ఏగా పోస్టు మంజూరు చేసినట్టు డీటీ తెలిపారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్‌కలెక్టర్

రంపచోడవరం: రంపచోడవరం ఐటిడిఏ సమావేశపు హాల్లో సోమవారం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ సీహెచ్.శ్రీనివాసరావులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు.

సమస్యలపై వినతులు

స్పందనలో 61 అర్జీలు అందినట్టు చెప్పారు. వై.రామవరం మండలం పాతకోట పంచాయతీలోని తంగేడికోట–కొప్పులకోట వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని, ఆర్.కొప్పులకోటలో రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కరించాలని, ప్రభుత్వ గృహాలు మంజూరు చేయాలని టి.బంతిరాజు ఫిర్యాదు చేశారు. రంపచోడవరం మండలంలోని బందపల్లి– పెదకోరుమిల్లి వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని చవలం బుల్లి దొర అర్జీ అందజేశారు. వై రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని కన్నెరు వాగు చెక్ డ్యామ్‌కు పూడికతీతలు తీయాలని, పెద్ద దెయ్యాలకట్టు వాగు నుంచి పంట పొలాలకు 300 మీటర్లకు ఇరువైపులా సీసీ వాలు ఏర్పాటు చేయాలని కోరుతూ చింతలపూడి పంచాయతీ ఉప సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి అర్జీ అందజేశారు. వై రామవరం మండలం చవిటిదిబ్బలులో పాడైన సోలార్ పంపుసెట్లు బాగు చేయాలని అబ్బాయిరెడ్డి, రెండు కాళ్లు పనిచేయడం లేదని స్వయం ఉపాధి కల్పించాలని కోరుతూ దేవీపట్నం మండలం దేవారం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు టి.వెంకటలక్ష్మి పీవోను కోరారు. రంపచోడవరం మండలం దారగూడెంలో జలజీవన్ ద్వారా తాగునీటి పనులను పూర్తి చేయాలని, కాకవాడ – కొయ్యలగూడెం వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఈతపల్లి కాలువపై వంతెన నిర్మించాలని ఆకూరు పంచాయతీ సర్పంచ్ కొమరం పండుదొర. ఎంపీటీసీ నర్రాపాపారావు స్పందనలో పీవోకు వివరించారు. ఎస్‌డీసీ శాస్త్రి. ఈఈలు నాగేశ్వరరావు. ఎండి యూసఫ్, ఏపిడి వెలుగు. ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తా

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

ముంచంగిపుట్టు: విద్యార్థుల సమస్యను నా సమస్యగా భావిస్తానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లా జెడ్పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఇంటర్ పరీక్ష కేంద్రం మరలా ముంచంగిపుట్టు రావడంపై విద్యార్థులంతా వారికి కృతజ్ఞతలు తెలుపుతూ చప్పట్లు మోత మోగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ విద్యార్థులు 18 కిలోమీటర్లు దూరంలో ఉన్న పెదబయలు వెళ్లి పబ్లిక్ పరీక్షలు రాయడం తనను తీవ్రంగా బాధించిందని, దీంతో ఉన్నతాధికారులతో చర్చించి ఇంటర్ కేంద్రం అందుబాటులో తీసుకొచ్చామన్నారు. అరకు అసెంబ్లీ పరిశీలకులు కొండలరావు, ఎంపీపీ అరిసెల సీతమ్మ, స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ సోభ సోమేశ్వరి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెట్టి గంగాధర్ స్వామి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి అధిక నిధుల కేటాయింపు హర్షణీయం


పడాల వీరభద్రరావు

కొయ్యూరు: గిరిజన సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో అదనపు నిధులు కేటాయించడం హర్షణీయమని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాదితో పోల్చితే రెట్టింపు నిధులు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. విభజన కారణంగా నష్టపోయిన ఏపీకి కేంద్రం ఎక్కువగా నిధులను కేటాయించి ఆదుకోవాలని కోరారు. అల్లూరి జిల్లాలోని గ్రామాల్లో రోడ్లు, వైద్య సదుపాయ కల్పించేందుకు వీలుగా నిధులు కేటాయించాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


మాట్లాడుతున్న ప్రకాష్

రాజవొమ్మంగి: అప్పలరాజుపేటలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ప్రాంతానికి చెందిన ఆయిల్ సంస్థ మేనేజర్ ఎ.ఎస్.ప్రకాష్ మాట్లాడుతూ నర్సరీల నుంచి పామ్‌ఆయిల్ మొక్కలను కొనుగోలు చేసుకొని సాగు ప్రారంభించాలన్నారు. నాలుగు సంవత్సరాల పాటు సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు రూ.5,250 చొప్పున ప్రభుత్వం సబ్సిడీతో పాటు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్‌ను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.13,700 ఉందని, మొక్కలు నాటిన ఐదేళ్ల తరువాత ఆయిల్‌పామ్ మొక్కలు గెలలు వేస్తాయన్నారు. ఎకరాకు ఏడాదిలో 8 టన్నుల దిగుబడి ద్వారా రూ.1.08లక్ష ఆదాయం సాధించవచ్చన్నారు. గాలి, అధికవర్షాలు, చీడపీడలు, కూలీల కొరత తదితర సమస్యలు ఈ పంటకు ఉండదని ఉదహరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో అరటి, కూరగాయలు తదితర అంతర పంటలు వేసుకోవచ్చన్నారు. రంపచోడవరం డివిజన్‌లో 3వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో సాగు కోసం రైతులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండల సభ్యుడు చీడిపల్లి అప్పారావు, తంటికొండ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, కొండపల్లి ప్రసాదరావు, సత్తిబాబు, మోహన్‌కుమార్, కేశవరావు, వెంకటరావు, చంద్రరావు, వీరబాబు, ఫీల్డ్‌స్టాఫ్ రామరాజు, నరేష్, సతీష్ పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షి,పాడేరు: కనీస వేతనాలతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం పాడేరు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షులు నాగమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పెంటమ్మ, కళావతి, ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పడాల్ తదితరులు జేసీ శివ శ్రీనివాస్‌కు అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

చింతూరు: కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చింతూరులో ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ వద్ద ధర్నా చేపట్టారు. శ్రీనివాసరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐటీడీఏ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సంఘం నాయకులు సత్యనారాయణ, నిర్మల మాట్లాడుతూ ఫేస్ యాప్‌ను విరమించుకోవాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామరాజు, శాంతిరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మెటివ్ పరీక్షలు

విశాఖ విద్య: క్లాస్ రూం బేస్డ్ ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)–3 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమౌతున్నాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 1 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నాలుగు రోజుల పాటు పరీక్షలు జరుగుతాయి. పాఠశాల స్థాయిలో సమాంతర చదువులకు ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఎస్సీఈఆర్టీ ద్వారా జారీ చేసిన ప్రశ్నా పత్రంతోనే పరీక్షలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు నుంచి విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని ఎమ్మార్సీలకు ప్రశ్నా పత్రాలను పంపిణీ చేశారు. పరీక్షల ప్రాధాన్యత దృష్ట్యా ఏ రోజు కారోజు మాత్రమే ఎమ్మార్సీల నుంచి స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రశ్నా పత్రాలను అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతి విద్యార్థులకు దీనికి మినహాయింపు ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన సమ్మెటివ్ పరీక్షల్లో విశాఖలోని కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల వారు ఎస్సీఈఆర్టీ ప్రశ్నా పత్రం కాకుండా, వారు సొంతంగా తయారు చేసుకున్న వాటితోనే పరీక్షలు నిర్వహించారు. తనిఖీ సమయంలో ఈ విషయాన్ని గుర్తించిన విశాఖ డిప్యూటీ డీఈవో సదరు విద్యా సంస్థల నిర్వాహకులను డీఈవో కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. అయితే ఎటువంటి చర్యలు లేకపోవడంతో, మంగళవారం నుంచి జరిగే ఫార్మెటివ్ పరీక్షల్లో ఎస్సీఈఆర్టీ ప్రశ్నా పత్రంను వినియోగిస్తారా..? లేదా మళ్లీ వారి సొంత పేపర్లు తయారు చేసుకుంటారా అనేది చూడాలి. ఇటువంటి విద్యా సంస్థల వారిని ఉపేక్షించడానికి వీల్లేదని ఉన్నతాధికారులు ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖాధికారులు విస్తృత తనిఖీలకు సిద్ధమయ్యారు.

పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి


రగ్గులు పంపిణీ చేస్తున్న సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కిశోర్ చౌదరి

జి.మాడుగుల: పోలీసుశాఖ అందిస్తున్న సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండెంట్ నేవల్ కిశోర్ చౌదరి తెలిపారు. మండలంలో నుర్మతి ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టు సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎగుమండిభ, దిగమండిభ, తోకగరువు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎగమండిభ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరగా త్వరలోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉదయ్, అప్పలరాజు, సత్యారావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాక్ పార్లమెంట్


మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విశాఖ న్యాయస్థానం పీపీ శశికాంతి, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మాక్ పార్లమెంట్‌ను ఘనంగా నిర్వహించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి అధ్యక్షతన పార్లమెంట్ నిర్వహణ ,సమావేశాల ప్రాధాన్యతపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. డిగ్రీ విద్యార్థులు ప్రధానమంత్రిగా, స్పీకర్‌గా, మంత్రులుగా, ప్రతిపక్ష పార్టీల నేతలుగా, ఎంపీలుగా పాత్రలు పోషించి పార్లమెంట్‌ను నిర్వహించారు. విశాఖపట్నంలోని రెండవ అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శశికాంతి మాట్లాడుతూ విద్యార్థులు రాజకీయాల్లో కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజనీతిశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ వి.రమేష్‌బాబు, అధ్యాపకులు వినీలా, అశ్వనీరెడ్డి, వనజ, మణికుమార్, ధర్మారావు, కోటేశ్వరరావు, మత్స్యరాజులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి


మృతి చెందిన సత్యారావు

బుచ్చెయ్యపేట: మండలం శివారు గ్రామం రాజాం వద్ద ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాలివి. పరవాడ మండలం బర్నికం గ్రామానికి చెందిన గవిరెడ్డి సత్యారావు(43) రాజాం గ్రామంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వారం రోజుల కిందట పొలం పనుల కోసం ట్రాక్టర్ తీసుకుని వచ్చాడు. పొలం దుక్కులు దున్నుకుంటూ ఆక్కడే ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం తన చెల్లెలు భర్త సుంకరి సత్యారావుతో కలిసి పొలం పనులకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న గవిరెడ్డి సత్యారావు అక్కడికక్కడే మృతి చెందగా అతని బావమరిదికి గాయాలయ్యాయి. సంఘటన గురించి తెలుసుకున్న బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సత్యారావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌జామ్

మారేడుమిల్లి: మారేడుమిల్లి –చింతూరు ఘాట్ రోడ్‌లో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం చింతూరు వైపు నుంచి మారేడుమిల్లి లోడుతో వస్తున్న లారీ ఘాట్‌లోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద మరమ్మతుల కారణంగా నిలిచిపోయింది. అదే సమయంలో అటువైపుగా ఊక లోడుతో వస్తున్న మరో లారీ నిలిచిపోయిన లారీ పక్క నుంచి రాకడానికి ప్రయత్నించగా ఆ లారీ కుడా అక్కడే నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

కోడిపందాలపై పోలీసుల దాడి

రంపచోడవరం: మండలంలోని పెద బారంగి శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 22 మందిని అరెస్టు చేసినట్టు సీఐ సురేష్ తెలిపారు. అలాగే 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి


రాము (ఫైల్)

రోలుగుంట: లగుడు కొత్తూరు గ్రామానికి చెందిన లగుడు రాము(35) గ్రామం నుంచి గుర్రాలపాలెం సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతూ మార్గమధ్యంలో బల్లిపాలెం బెల్లం క్రషర్ సమీపంలో ప్రమాదవశాత్తూ చెట్టుని ఢీకొని మృతి చెందాడు. ఘటనపై మృతుడి పెద నాన్న లగుడు అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.నాగకార్తీక్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి వెళ్లి స్థానికులను విచారించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు వృత్తిరీత్యా తాపీ మేస్త్రి. భార్యతో కొన్నాళ్లుగా కలిసి ఉండడం లేదు. వీరికి పిల్లలు లేరు.

ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ

పాడేరు రూరల్: ప్రసవాలకు సిద్ధంగా ఉన్న గర్భిణులను సకాలంలో గుర్తించి వారిని బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు, తరలించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేటట్టు చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్ బాషా సూచించారు. ఇటీవల నూతనంగా నియమితులైన ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌వో)లకు స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నివారణకు వైద్యా ఆరోగ్య శాఖ ద్వారా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై వివరించారు. వ్యాధుల నిర్ధారణ కోసం నిర్వహించే 14 రకాల పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులపై పర్యవేక్షణపై శిక్షణ ఇచ్చారు. వారం రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సిందూరాం పడాల్, డాక్టర్ విష్ణుష్, జిల్లా గణాంకాధికారి జె. కైలాస్, జిల్లా టీబీ పర్యవేక్షకులు వి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు


పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్-డీ42 బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్–డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. సుమారు 200 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్–డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహిస్తేనే దేశాభివృద్ధి

- ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారు
- జెండర్ రెస్పాన్సిబిలిటీ వర్క్‌షాప్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కొమ్మాది : ప్రాచీన కాలంలో మహిళలను దేవతలుగా కొలిచేవారని అందుకే నదులు పేర్లు కూడా స్త్రీల పేర్ల మీదే ఉన్నాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. రుషికొండలో నిర్వహిస్తున్న జెండర్ రెస్పాన్సిబిలిటీ వర్క్‌షాప్‌లో భాగంగా షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్ మహిళా ప్రజాప్రతినిధుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులిద్దరూ బండికి రెండు చక్రాలు వంటి వారని, సమాజంలో వారిని సమానంగా చూసిననాడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక వ్యక్తి చదువుకుంటే ఆ వ్యక్తికి మాత్రమే ఉపయోగపడుతుందని, ఒక స్త్రీ చదువుకుంటే కుటుంబమంతటికీ మేలు జరుగుతుందని చెప్పారు. మహిళలకు చట్టసభల్లో సమాన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరముందన్నారు. మహిళలు శక్తి వంతంగా పనిచేయడానికి ఆర్థిక వనరులు కూడా సమకూర్చాలన్నారు. న్యాయకత్వంలో వైవిధ్యం, లింగ సమతుల్యత విలువను తక్కువగా అంచనా వేయకూడదని సూచించారు. నేషనల్ కమిషన్ ఫర్ ఉమన్ పాన్ ఇండియా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ మహిళా నేతల విజయాలకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ మాట్లాడుతూ మహిళా సాధికారిత లేకుండా ఎవరూ ఎదగలేరని, పార్లమెంట్‌కు ఎక్కువ మంది మహిళలు ఎన్నిక కావడానికి తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ దిశ పన్ను, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

అనకాపల్లిటౌన్: బీసీలదే రాజ్యాధికారమని అఖిల భారత ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతుల ప్రసాద్‌నాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విజయారెసిడెన్సీలో ఉత్తరాంధ్ర బీసీసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఆడారి కుమారస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. బీసీ జనగణన జరగాలని, తెలంగాణలో రిజర్వేషన్ నిలిపివేసిన 26 కులాలను తక్షణమే బీసీలుగా పరిగణించాలని అన్నారు. ఏపీలో అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జ్యోతిరావు పూలే విగ్రహాలు నిర్మించాలన్నారు. అంతకుముందు పట్టణంలో గాంధీనగరం బీసీ వసతి గృహంలో ఆయన సోమవారం మొక్కలు నాటి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు.